కన్నీటితో కుస్తీకి వీడ్కోలు

మళ్లీ బరిలోకి దిగను: సాక్షి మాలిక్

డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్ష ఎన్నికను వ్యతిరేకిస్తూ.. స్టార్ రెజ్లర్ సంచలన నిర్ణయం

కొత్త అధ్యక్షుడిగా సంజయ్‌సింగ్ ఎన్నిక

న్యూఢిల్లీ: జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్(డబ్ల్యూఎఫ్ఐ) మళ్లీ వార్తల్లోకెక్కింది. పలు అవాంతరాల అనంతరం తాజాగా జరిగిన డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలు మరోమలుపు తీసుకున్నాయి. గురువారం జరిగిన ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సంజయ్‌సింగ్..సమీప ప్రత్యర్థి అనితా షెరాన్‌పై ఏకపక్ష విజయం సాధించాడు. సంజయ్‌సింగ్‌కు 40 ఓట్లు పోల్ కాగా, అనిత ఏడు ఓట్లతో సరిపెట్టుకుంది. అయితే అనిత వర్గానికి చెందిన ప్రేమ్‌చంద్ కీలకమైన ప్రధాన కార్యదర్శి పదవి దక్కించుకోగా, దేవందర్‌సింగ్ కదియాన్ సీనియర్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. మొత్తంగా 15 స్థానాల్లో సంజయ్‌సింగ్ వర్గం 13 స్థానాలు తమ ఖాతాలో వేసుకుంది. ఇక్కడికి వరకు బాగానే ఉంది. బీడబ్ల్యూఎఫ్ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ సన్నిహితుడైన సంజయ్‌సింగ్ ఎన్నిక కావడాన్ని స్టార్ రెజ్లర్లు సాక్షి మాలిక్, బజరంగ పునియా, వినేశ్ ఫోగట్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఓవైపు సంజయ్‌సింగ్ విజయంతో బ్రిజ్‌భూషణ్ వర్గం పెద్ద ఎత్తున సంబురాల్లో ఉంటే..మరోవైపు పునియా, వినేశ్‌తో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న సాక్షి మాలిక్ సంచలన నిర్ణయం తీసుకుంది. బ్రిజ్‌భూషణ్ మనిషిగా ముద్రపడ్డ సంజయ్‌సింగ్ అధ్యక్ష పదవి దక్కించుకోవడాన్ని తీవ్రంగా నిరసిస్తూ తన కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ సాక్షి..మీడియా ముఖంగా ప్రకటించింది. ఇక నుంచి తాను ఎట్టి పరిస్థితుల్లో తిరిగి బరిలోకి దిగనని ప్రకటిస్తూ తన షూస్‌ను టేబుల్‌పై పెడుతూ మధ్యలోనే బయటకు వెళ్లిపోయింది. మరోవైపు బజరంగ్ పునియా, వినేవ్ ఫోగట్..సంజయ్‌సింగ్ నియామకాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. మేము ఎవరిపైన అయితే పోరాడామో.. తిరిగి వారే పదవిలోకి రావడాన్ని ఎట్టి పరిస్థితుల్లో సమర్థించబోమని ప్రకటించారు. మహిళా రెజ్లర్లను లైంగికంగా, మానసికంగా వేధిస్తున్న బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా ఇన్నాళ్లు తాము చేసిన పోరాటానికి విలువ లేకుండా పోయిందని ఈ సందర్భంగా స్టార్ రెజ్లర్లు వాపోయారు.

ఫలించని పోరాటం

డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ అరాచకాలపై రెజ్లర్లు బజరంగ్ పునియా, వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్‌తో పాటు పలువురు రెజ్లర్లు చేసిన పోరాటానికి ఫలితం లేకుండా పోయింది. బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఢిల్లీ నడివీధుల్లో గొంతు చించుకుని పోరాడిన కుస్తీవీరుల ఆశయం నెరవేరలేదు. ప్రతికూల పరిస్థితుల మధ్య రెజ్లర్లు చేసిన పోరాటానికి యావత్ దేశం మద్దతుగా నిలిచింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన రెజ్లర్లు చేసిన ధర్నాకు కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు దిగి వచ్చింది. బ్రిజ్‌భూషణ్‌కు సంబంధించిన మనుషులను ఎట్టి పరిస్థితుల్లో ఎన్నికల గోదాలో నిలబడనీయబోమని మంత్రి అనురాగ్ ఇచ్చిన హామీ మేరకు రెజ్లర్లు తమ నిరసనకు ముగింపు పలికిన సంగతి తెలిసిందే.

సూపర్ సంజూ

మూడో వన్డేలో భారత్ జయభేరి • 2-1తో సిరీస్ కైవసం

యువ ఆటగాళ్లతో కూడిన భారత జట్టు అద్భుతాన్ని ఆవిష్కరించింది. దక్షిణాఫ్రికా పర్యటనలో రెండోసారి వన్డే సిరీస్ కైవసం చేసుకొని నయా చరిత్ర లిఖించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన తొమ్మిదేండ్లకు సంజూ శాంసన్ తొలి సెంచరీ తన పేరిట లిఖించుకొని జట్టుకు భారీ స్కోరు అందించగా.. తెలంగాణ కుర్రాడు తిలక్ వర్మ, నయా ఫినిషర్ రింకూ సింగ్ తమ వంతు బాధ్యత నిర్వర్తించారు. ఆనక ఛేదనలో ఓపెనర్ జోర్జి పోరాడినా.. మన బౌలర్లు సమిష్టిగా సత్తాచాటి సఫారీలకు అడ్డుకట్ట వేశారు.

పార్ల్: దక్షిణాఫ్రికా గడ్డపై భారత జట్టు రెండో వన్డే సిరీస్ కైవసం చేసుకుంది. 2018లో విరాట్ కోహ్లీ సారథ్యంలోని టీమ్‌ఇండియా తొలిసారి సఫారీ నేలపై వన్డే సిరీస్ గెలువగా.. ఇప్పుడు రాహుల్ సారథ్యంలోని భారత జట్టు సేమ్ సీన్ రిపీట్ చేసింది. గురువారం జరిగిన మూడో వన్డేలో భారత్ 78 పరుగుల తేడాతో జయకేతనం ఎగరవేసింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 296 పరుగులు చేసింది. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన సంజూ శాంసన్ (114 బంతుల్లో 108; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) వన్డేల్లో తొలి సెంచరీ నమోదు చేసుకోగా.. హైదరాబాదీ తిలక్ వర్మ (52; 5 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధశతకంతో మెరిశాడు. చివర్లో రింకూ సింగ్ (27 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) విలువైన పరుగులు చేశాడు. గత రెండు మ్యాచ్‌ల్లో అర్ధశతకాలు సాధించిన సాయి సుదర్శన్ (10) విఫలం కాగా.. ఈ మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ వన్డే అరంగేట్రం చేసిన రజత్ పాటిదార్ (22), కెప్టెన్ కేఎల్ రాహుల్ (21) ఎక్కువసేపు నిలువలేకపోయారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో హెన్రిక్స్ 3, బర్గర్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 45.5 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌటైంది. గత మ్యాచ్ సెంచరీ హీరో జోర్జి (81; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) మరోసారి సత్తాచాటగా.. కెప్టెన్ మార్క్‌రమ్ (36) పర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 4, వాషింగ్టన్ సుందర్, అవేశ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. శాంసన్‌కు మ్యాన్ ఆఫ్ మ్యాచ్, అర్ష్‌దీప్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు దక్కాయి.

THE HOUSE OF McDowell's GLASSWARE

సంక్షిప్త స్కోర్లు

భారత్: 296/8 (శాంసన్ 108, తిలక్ 52; హెన్రిక్స్ 3/63, బర్గర్ 2/64), **దక్షిణాఫ్రికా:** 45.5 ఓవర్లలో 218 ఆలౌట్ (జోర్జి 81, మార్క్‌రమ్ 36; అర్ష్‌దీప్ 4/30, సుందర్ 2/38).

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

సంజూ శాంసన్.. ఈ పేరు తలుచుకోగానే.. ప్రతి భారత అభిమానికి గుర్తొచ్చే మొదటి పదం దురదృష్టవంతుడు. అపార ప్రతిభ ఉన్నా.. సరైన అవకాశాలు రాక.. వచ్చిన వాటిలో అద్భుతాలు చేయలేక.. అంతర్జాతీయ క్రికెట్‌లో తనదైన ముద్ర వేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్లేయర్‌గా శాంసన్ సుపరిచితుడు. దేశవాళీ టోర్నీలతో పాటు ఐపీఎల్లో మెరుగైన ప్రదర్శన చేసిన సంజూ అప్పుడెప్పుడో 2015లో జాతీయ జట్టు తరపున అరంగేట్రం చేసినా.. ఈ తొమ్మిదేండ్లలో అతడు వేళ్ల మీద లెక్క పెట్టగల వన్డేలు మాత్రమే ఆడాడు. అందులో మంచి గణాంకాలే ఉన్నా.. మ్యాచ్ విన్నింగ్ పర్ఫామెన్స్‌లు పెద్దగా లేకపోవడంతో అతడికి ఎక్కువ అవకాశాలు రాలేదు. ఇప్పుడు వన్డే ప్రపంచకప్ అనంతరం సీనియర్లు విశ్రాంతి తీసుకుంటుండంతో.. సఫారీ టూర్‌లో అతడికి చాన్స్ దక్కింది. ఈ సారి దాన్ని రెండు చేతుల ఒడిసి పట్టుకున్న శాంసన్ అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి సెంచరీతో చెలరేగాడు. అరంగేట్ర ఆటగాడు రజత్ పాటిదార్ త్వరగానే ఔట్ కావడంతో ఐదో ఓవర్‌లోనే క్రీజులోకి వచ్చిన సంజూ అక్కడి నుంచి బాధ్యతను భుజాలపై ఎత్తుకొని ఇన్నింగ్స్ నడిపించాడు. రాహుల్, తిలక్‌తో చక్కటి భాగస్వామ్యాలు నమోదు చేసి జట్టును సురక్షిత ప్రాంతాలకు చేర్చాడు. ఆఖర్లో రింకూ మెరుపులు మెరిపించడంతో టీమ్‌ఇండియా మంచి స్కోరు చేయగలిగింది.

పూజ విజృంభణ

ఆసీస్ 219 ఆలౌట్; భారత్ 98/1

మహిళల ఏకైక టెస్టు

అద్వితీయ ప్రదర్శనతో ఇంగ్లండ్‌ను మట్టికరిపించిన భారత మహిళల జట్టు.. ఆస్ట్రేలియాపై కూడా అదే జోరు కొనసాగిస్తున్నది. ఏకైక టెస్టులో కట్టుదిట్టమైన బౌలింగ్‌తో కంగారూలను కట్టడి చేసిన టీమ్‌ఇండియా.. బ్యాటింగ్‌లోనూ అదరగొట్టింది.

ముంబై: సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత మహిళల జట్టు దుమ్మురేపుతున్నది. ఇటీవల ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించిన టీమ్‌ఇండియా.. గురువారం ఆస్ట్రేలియాతో ప్రారంభమైన ఏకైక టెస్టులో శుభారంభం చేసింది. బౌలర్లు సమిష్టిగా కదంతొక్కడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 219 పరుగులకు ఆలౌటైంది. తహిలా మెక్‌గ్రాత్ (50), బెత్ మూనీ (40), అలీసా హీలీ (38) రాణించారు. భారత బౌలర్లలో పూజ వస్త్రాకర్ (4/53), స్నేహ్ రాణా(3/56) విజృంభించారు. ముఖ్యంగా పూజ పదునైన పేస్‌తో కంగారూ బ్యాటర్ల భరతం పట్టింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన హర్మన్‌ప్రీత్ బృందం తొలి రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 98 పరుగులు చేసింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (40; 8 ఫోర్లు), స్మృతి మందన (43 నాటౌట్; 8 ఫోర్లు) సత్తాచాటారు. చేతిలో 9 వికెట్లు ఉన్న టీమ్‌ఇండియా.. ప్రత్యర్థి స్కోరు కంటే 121 పరుగులు వెనుకబడి ఉంది. స్మృతితో పాటు స్నేహ్ రాణా క్రీజులో ఉంది.

చెన్నై చెస్ చాంప్ గుకేశ్

చెన్నై: చెన్నై గ్రాండ్ మాస్టర్ చెస్ చాంపియన్‌షిప్‌లో దొమ్మరాజు గుకేశ్ విజేతగా నిలిచాడు. గురువారం జరిగిన టైబ్రేక్ పోరులో గుకేశ్..తెలంగాణకు చెందిన ఇరిగేసి అర్జున్‌పై విజయం సాధించాడు. మొత్తం ఏడు రౌండ్లు ముగిసే సరికి గుకేశ్, అర్జున్ 4.5 పాయింట్లతో సమంగా నిలిచారు. అయితే విజేతను నిర్ణయించేందుకు టైబ్రేక్ నిర్వహించారు. ఏడో రౌండ్ పోరులో హరికృష్ణతో గేమ్‌ను గుకేశ్ డ్రా చేసుకోగా, సుగ్రోవ్(హంగరీ)పై అర్జున్ విజయం సాధించాడు. చెన్నై టైటిల్ విజయం ద్వారా..ఉజ్బెకిస్థాన్‌లో జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత అవకాశాలను గుకేశ్ మెరుగుపర్చుకున్నాడు.

జోరుగా సాధన

సెంచూరియన్: దక్షిణాఫ్రికా గడ్డపై తొలి సారి టెస్టు సిరీస్ గెలువాలనే లక్ష్యంతో ఉన్న భారత జట్టు దాని కోసం తీవ్రంగా శ్రమిస్తున్నది. ఒకవైపు రాహుల్ సారథ్యంలో సఫారీలతో వన్డే సిరీస్ జరుగుతుండగానే.. టీమ్‌ఇండియా ప్రధాన ఆటగాళ్లు ఇంట్రా స్క్వాడ్ గేమ్‌లో తలపడుతున్నారు. ఇందులో యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ సెంచరీతో కదం తొక్కగా.. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీతో పాటు యశస్వి జైస్వాల్ మంచి టచ్‌లో కనిపించారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఈ నెల 26 నుంచి తొలి టెస్టు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే.

జాతీయ బాక్సింగ్ టోర్నీకి ఐదుగురు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అకోలా (మహారాష్ట్ర) వేదికగా జరిగే జాతీయ బాక్సింగ్ టోర్నీకి తెలంగాణకు చెందిన ఐదుగురు బాక్సర్లు ఎంపికయ్యారు. ఈ నెల 19న మహబూబాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాక్సర్లు జాతీయ టోర్నీలో ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిలో అనుముల సాయిభార్గవ్‌రెడ్డి, శ్రీకర్‌కుమార్, నిఖిల్‌గౌడ్, శ్రీశాంత్ పసిడి పతకాలతో మెరువగా, బాలాజీ రజతం దక్కించుకున్నాడు. వీరంతా ఈ నెల 24 నుంచి జరిగే జాతీయస్థాయి టోర్నీలో బరిలోకి దిగనున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.